




అమరావతిలో రెండు రోజులపాటు జరగనున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో తొలిరోజు బుధవారం సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

చలి పంజా..!

- తగ్గిన ఉష్ణోగ్రతలు
- వణికిస్తున్న చలిగాలులు
- రానున్న రోజుల్లో మరింత తీవ్రం



ఆచంటలో దట్టంగా పొగ మంచు



చలి కాగుతున్న యువకులు

ప్రజాశక్తి - ఆచంట

జిల్లాలో నాలుగైదు రోజులుగా చలి గాలుల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు కూడా తగ్గాయి. ప్రస్తుతం జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. జిల్లాపై చలి పులి పంజా విసురుతోంది. ఉదయం ఎనిమిది గంటలు దాటే వరకూ ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు పొగ మంచు రాత్రి పది గంటలు తర్వాత దట్టంగా కమ్ముకుంటుంది. మారిన వాతావరణంతో ప్రజలు చలికి గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం ఐదారు గంటల తర్వాత నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకూ చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గతేడాది ఇదే సమయానికి అంతగా చలి అన్పించలేదు. గత వారం రోజులుగా ఉదయం ఎండ తీవ్రత, రాత్రి సమయంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చలి తీవ్రతతో చాలామందికి జలుబు, దగ్గు జ్వరం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా సైనసైటీస్, సమస్య ఉన్నవారు తుమ్ములతో బాధపడటం ముక్కు మూసుకుపోవడం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం చలి చంపేస్తుండటంతో ప్రజలు సాయంత్రం అయిందంటే చాలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం వాకింగ్ జాగింగ్ చేసేవారు, పొలం పనులకు వెళ్లే కౌలు రైతులు, పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. శీతాకాలం ఆరంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో చలి ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పొగ మంచు వల్ల వాహనదారులు, పాద చారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల నుంచి 32 డిగ్రీల మధ్య, రాత్రులు 20 నుంచి 22 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. పగలు గాల్లో తేమశాతం 56 నుంచి 60 శాతం మధ్య నమోదవుతుంది. ఇదే వారం రోజుల క్రితం పరిస్థితిని పరిశీలిస్తే పగటిపూట గాలిలో తేమశాతం ఐదు వరకు తగ్గుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాత్రులు గాలిలో తేమశాతం గరిష్టంగా 96 వరకు నమోదవుతుంది. వారం క్రితం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే రాత్రులు తేమ శాతం మధ్య వ్యత్యాసం 15 నుంచి 20 వరకు ఉంటుంది. దీంతో రాత్రులు చలి తీవ్రత పెరుగుతుంది. జనవరి చివరి వరకు చలిగాలుల ప్రభావం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ వై.అనూష, ఆచంట సిహెచ్‌సి సూపరింటెండెంట్



ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ చలిగాలుల వల్ల పలు వ్యాధులతో బాధపడుతున్న వారు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చలి వల్ల ఊపిరితిత్తులు కొంత అనారోగ్యానికి గురవుతాయి. చర్మం పగుళ్లబారడం ఉంటుంది. చలికాలంలో చిన్నారులు, వృద్ధులకు సమస్యలు ఎక్కువగా ఉంటాయి. చలికాలంలో వీరికి రోగనిరోధక శక్తి లోపించి ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. దగ్గుతో కఫాన్ని బయటకు పంపించే శక్తి లేకపోవడం వల్ల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఎక్కువవుతుంది. వృద్ధుల్లో ప్రత్యేకించి ఆర్థరైటిస్ ఉంటే ఎముకలు మరింత బిగిసిపోయే ప్రమాదం ఉంది. చిన్నారులకు చలిగాలులు తగలకుండా స్వెట్టర్లు, మెత్తని రంగులు వాడాలి. చలికాలంలో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఉష్ణోగ్రతలు పడిపోయినప్పుడు రక్తనాళాలు మూసుకుపోయి, రక్తాన్ని శరీర భాగాలకు పంపిణీ చేయడం గుండెకు కష్టమవుతోంది. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపిణీ చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ఆస్తమా వ్యాధిగ్రస్తులై ఉంటే చలిగాలి వల్ల శ్వాసనాళాలు కుచించుకుపోతాయి. అందువల్ల చలిగాలులు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

నేటి నుంచి ఇంటింటా సర్వే

కుటుంబ వివరాలు సేకరించనున్న సచివాలయాల సిబ్బంది

ప్రత్యేక యాప్‌లో నమోదు - వచ్చే నెల 12వ తేదీతో పూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర ప్రభుత్వం 'యునైటెడ్ ఫ్యామిలీ సర్వే'కు శ్రీకారం చుట్టింది. ఈ నెల 18వ తేదీ నుంచి 2026 జనవరి 12వ తేదీ వరకు సర్వే నిర్వహించాలి. ఇందులో భాగంగా మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో సచివాలయ సిబ్బందికి శిక్షణ ప్రారంభించారు. బుధవారంతో ఈ శిక్షణ తరగతులు ముగిశాయి. గురువారం నుంచి సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సమగ్ర వివరాలు సేకరిస్తారు. వీటిని యుఎఫ్‌ఎస్ ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేసి ఇకెవైసి చేయనున్నారు. ప్రతి కుటుంబంలో ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, ఇతర వివరాలను సేకరిస్తారు. ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, కుటుంబ ఆదాయం, స్థిరాస్తుల వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. సర్వే ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుంది. ఈ నెల 18 నుంచి జనవరి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కుటుంబాలకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే సాగనుంది.


భవిష్యత్తు ప్రభుత్వ పథకాల కోసం సర్వే

వి.రమేష్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్

అన్ని శాఖలకు ఉపయోగపడేలా డేటా ఒకే చోటకు సేకరిస్తారు. ఆర్‌టిజిఎస్ డేటా కచ్చితత్వం కోసం భవిష్యత్తు ప్రభుత్వ పథకాలు సేవలకు మార్గదర్శం ఉపయోగపడుతుంది. సచివాలయ సిబ్బంది ఇంటికే వచ్చి మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తారు. కుటుంబ సభ్యుల సామాజిక, విద్య, ఉపాధికి సంబంధించిన ప్రాథమిక వివరాలు సేకరిస్తారు.

కౌశల్ విజేతలకు బహుమతులు ప్రదానం

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలి: డిఇఒ నారాయణ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిఇఒ నారాయణ

ప్రజాశక్తి - భీమవరం

భారతీయ విజ్ఞాన మండలి, ఎపి సైన్స్ సిటీ, ఆప్ కాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కౌశల్ రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభ అన్వేషణ పోటీల్లో భాగంగా జిల్లాలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన 12 మంది విద్యార్థులకు డిఇఒ ఇవివిఎస్ఎస్ఎస్‌పివి.నారాయణ బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా డిఇఒ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి అన్ని రకాల ప్రతిభ పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు నిష్ణాతులు కావడానికి, వారి పురోభివృద్ధికి దోహదపడతాయన్నారు. విద్యార్థులందరూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అక్కడ కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ ఈ 12 మంది విద్యార్థులు ఈ నెల 27న తిరుపతిలో సాంస్కృతిక విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కౌశల్ జిల్లా జాయింట్ కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, టెక్నికల్ కోఆర్డినేటర్ ఎస్.వరప్రకాష్, డిసిఇబి సెక్రటరీ జివి వి.శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి వి.పూర్ణచంద్రరావు, అపకాస్ట్ జిల్లా సమన్వయాధికారి మల్లుల శ్రీనివాస్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు టి.రాము, ఎంఇఒ శ్రీమన్నారాయణ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలి

పోస్టర్ ఆవిష్కరణలో ఎంఎల్‌సి గోపీమూర్తి




పోస్టర్ ఆవిష్కరించిన గోపీమూర్తి, జెవివి, యుటిఎఫ్, చెకుముకి నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 21, 22, 23వ తేదీల్లో కాకినాడలోని జెఎన్‌టియులో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 34 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పట్ల అభిరుచిని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. పోటీతత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాల పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాల్లో సైన్స్ ప్రయోగాల పోటీ, కథల పోటీ, విజువల్ క్విజ్, రాపిడ్ క్విజ్, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, కోరింగ అభయారణ్య సందర్శన, స్కై వాచ్ వంటి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ జిల్లా నుంచి చింతపర్రు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు, భీమవరం విష్ణు స్కూల్ విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, బి.నాగబాబు, బిఆర్ఎంకె.స్వామి, జి.రామకృష్ణంరాజు, పి.శివప్రసాద్, పి.శ్రీనివాస్, కె.పెద్దిరాజు పాల్గొన్నారు.

పాలకొల్లుకు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ హోదా




మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఫస్ట్ గ్రేడ్‌గా ఉన్న పాలకొల్లు మున్సిపాలిటీ స్పెషల్ గ్రేడ్ మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ అయ్యిందని నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు చెప్పారు. ఆయన మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యంతో స్పెషల్ గ్రేడ్ పొందిందని చెప్పారు. దీనికి సహకరించిన సిఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖామంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. పాలకొల్లు ప్రజలకు ఇది సువర్ణయుగమన్నారు. మంత్రి నిమ్మల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు తీసుకు రావడానికి అవకాశం ఉంటుందన్నారు. పాలకొల్లు వంద సంవత్సరాలు కిందటే మున్సిపాలిటీగా అవతరించిందని, దీనితర్వాత మున్సిపాల్టీలుగా అవతరించిన ఎన్నో మున్సిపాల్టీలు స్పెషల్ గ్రేడ్‌లుగా అప్‌గ్రేడ్ అయ్యాయని చెప్పారు. 1965లో ఫస్ట్‌క్లాస్ మున్సిపాలిటీగా ఉన్న పాలకొల్లు 60 సంవత్సరాల తర్వాత స్పెషల్ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్‌గా అయ్యిందన్నారు. దీంతో పాలకొల్లు రూపురేఖలు త్వరలో మారుతాయన్నారు. ఇప్పటికే మంత్రి నిమ్మల కృషితో అబ్దుల్‌కలాం పార్కు, చంద్రబాబు పార్కు ఆహ్లాదంగా తీర్చిదిద్దారని, ఎన్‌టిఆర్ కళాక్షేత్రం హైదరాబాద్, విశాఖల వలె ప్రఖ్యాతి చెందుతుందన్నారు. పాలకొల్లు కళాకారులకు నిలయంగా ఉందని, అటువంటి మున్సిపాల్టీల త్వరలోనే మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, కూటమి నేతలు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో మెడికల్ ల్యాబ్

ఎంఎల్ఎ చేతుల మీదుగా పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మంచనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బిపిహెచ్‌యు) భవనం పనులను బుధవారం భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ మెడికల్ ల్యాబ్‌ను నిర్మించనున్నారు. జాతీయ ఆరోగ్య మౌలిక సదుపాయాలు బలోపేతంలో భాగంగా ఈ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజల ఇళ్లకు దగ్గరగా తీసుకురావడమే లక్ష్యంగా ఈ తరహా ల్యాబ్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. ఇది అందుబాటులోకి వస్తే ప్రస్తుతం ఉన్న వైద్య పరీక్షలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఆకుల లీలాకృష్ణ, ఎంపిడిఒ వైభావతి, వీరవల్లి చంద్రశేఖర్, వేండ్ర దివాకర్, వైద్యాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుబ్బరాజు చెరువు ప్రాంత వాసులకు ప్రత్యామ్నాయం చూపాలి

సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ్య



వినతిని అందజేస్తున్న నేతలు, బాధితులు

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లు సుబ్బరాజు చెరువు ఆనుకుని ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ఆ ప్రాంత వాసులకు ప్రత్యామ్నాయం చూపించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ్య డిమాండ్ చేశారు. మొగల్లు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌కు సిపిఎం ఆధ్వర్యాన సుబ్బరాజు చెరువు ప్రాంతవాసులకు ప్రత్యామ్నాయం చూపించి, పునరావాసం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రియ్య మాట్లాడుతూ సుబ్బరాజు చెరువు ప్రాంతవాసుల గృహాలు తొలగించాలని ఇటీవల పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. అయితే బాధితులు కోర్టును ఆశ్రయించడం జరిగిందని పేర్కొన్నారు. వారికి ప్రత్యేకమైన పునరావాసం కల్పించేంత వరకు ఇల్లు తొలగించొద్దని తెలిపారు. దీనికి సహకారం అందించాలని పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను కోరారు. వినతిని అందజేసిన వారిలో వెంకటేశ్వరరావు, రామానుజ దాస్, బేబి ఉన్నారు.

నూతన ఆవిష్కరణలు భవిష్యత్తుకు నాంది

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఎంఎల్ఎ నాయకర్



ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

శాస్త్రీయ ఆలోచన, నూతన ఆవిష్కరణలతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శ్రీవైఎన్ కళాశాలలో బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యాన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. మండల పరిధిలోని పాఠశాల విద్యార్థులు రూపొందించిన 100కుపైగా సైన్స్ అంశాలను ప్రదర్శించారు. మండల పరిధిలోని పలు స్కూల్ విద్యార్థులు ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ నాయకర్ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ విజ్ఞాన ప్రదర్శనలను పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు పి.పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుబజార్ నిర్వహణపై ప్రజలు సంతృప్తి

జెసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రైతుబజార్ నిర్వహణ, ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ సంతృప్తి స్థాయిలో ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. జెసి సూచనల మేరకు భీమవరం రైతుబజార్‌లో సౌకర్యాలు, కూరగాయల ధరలపై ప్రజల నుండి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌ను బుధవారం కలెక్టరేట్లో తెరిచారు. ప్రజల నుండి వచ్చిన అభిప్రాయాలను జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతుబజార్లో సైకిల్ స్టాండు ఏర్పాటు చేయాలని, స్టాల్స్ నెంబర్లను, కూరగాయల ధరలు ఎప్పటికప్పుడు డిస్‌ప్లే చేయాలని ఫిర్యాదుల ద్వారా తెలియజేశారన్నారు. బహిరంగ మార్కెట్‌కన్నా రైతు బజార్లో కూరగాయల ధరలు సంతృప్తికరంగా, తాజాగా ఉన్నాయని జనం పేర్కొన్నారనని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ ఎడి కె.సునీల్‌కుమార్, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కళ్యాణ్ పాల్గొన్నారు.

డ్వాక్రాలో అవినీతికి బాధ్యులెవరు?

తమకు న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

అసలు దొంగలెవరో తేలేనా..!



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న డ్వాక్రా మహిళలు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఆకివీడు

గత పది రోజులుగా స్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ డబ్బులు కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ చేస్తున్న ఆందోళనను ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. డ్వాక్రా సంఘాల సభ్యులకు సంబంధించి డబ్బు స్వాహా చేసిన ఘటన ఈనెల 8న వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. యానిమేటర్లు సుధ, హేమలతల వల్ల అన్యాయం జరిగిందని, లక్షల స్థాయి దాటి కోట్ల రూపాయలు కోల్పోయామని డ్వాక్రా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని ఇప్పటికే ఉద్యమం ప్రారంభించారు. స్థానికంగా జాతీయ రహదారిని స్తంభింప చేశారు. ఆ సమయంలో ఎస్ఐ నచ్చజెప్పి బ్యాంకర్స్‌తో సమన్వయం చేయడంతో ఆగారు. రెండు రోజులు ఆగి జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అయినప్పటికీ ఫలితం కనిపించలేదు. అయితే ఇక్కడ డబ్బులు పోయాయి అన్నది అందరికీ తెలిసిన విషయమే. ఆ డబ్బులు ఎక్కడికి పోయాయి? ఎవరు స్వాహా చేశారు? అసలు దొంగ ఎవరు అన్నది ఎప్పటికి తేలుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోపక్క తాము నష్టపోయి ఉన్నప్పటికీ.. తమ ఖాతాల్లో ఎవరో తీసుకున్న డబ్బులకు తమను బ్యాంకు డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని సభ్యులు విమర్శిస్తున్నారు. తమకు ఎంత మాత్రం బాధ్యత లేదని వారు చెబుతున్నారు.

బ్యాంకర్ పాత్ర ప్రధానమా..

లక్షలు, కోట్ల రూపాయలు బ్యాంకర్ ప్రమేయం లేకుండా బయటకి వెళ్లే అవకాశం ఉందా? ఒక్క రూపాయి కూడా ఇవ్వడానికి బ్యాంకరు అనేక నిబంధనలు, నియమాలు చూపిస్తున్న సమయంలో ఇలా కోట్ల రూపాయలు మాయం కావడం వెనుక ఎవరి హస్తం ఉందనేది తేలాల్సి ఉంది. అయితే ఇందులో బ్యాంకర్ పాత్ర ప్రధానంగా ఉంటుందని సర్వత్రా వినపడుతోంది. ఒకసారి గత చరిత్ర తిరగవేస్తే ఇక్కడ కుంభకోణాలు జరిగిన చరిత్ర చాలా స్పష్టంగా వినపడుతుంది. పేరు మారినా తీరు మారలేదన్నది స్పష్టం. ఒక యానిమేటర్ స్థాయిలో లక్ష రూపాయలు చేయి మారడానికి ధైర్యం చాలని పరిస్థితుల్లో బ్యాంకర్ ప్రమేయం లేకుండా సుమారు 40 గ్రూపులు పైబడి సిసి లోను సంపాదించుకోగలవా? గత రుణం తీరకుండా బ్యాంకులు సిసి లోన్ ఇచ్చినా అక్కడ నిబంధనలు ఒప్పుకుంటాయా? సభ్యులకు తెలియకుండా, సభ్యులు తీసుకోకుండా రుణం మంజూరు అవుతుందా ఇలా అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

మెప్మా ఫిర్యాదు..

స్వయం సహాయక సంఘాల ఆందోళనపై ఎట్టకేలకు మెప్మా అధికారులు స్పందించారు. జిల్లా పరిపాలనాధికారి జి.హెప్సిబా ఇటీవల ఇక్కడికి వచ్చారు. బ్యాంకర్‌కు, పోలీసులకు తమకు పూర్తి వివరాలు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. బ్యాంకులో జరిగిన పూర్తి వివరాలు తెలిస్తే తాము శాఖాపరమైన విచారణ ప్రారంభిస్తామని తెలిపారు.

పోలీసుల ఆధీనంలో హేమలత..?


హేమలత ఈనెల 16 మంగళవారం మధ్యాహ్నం తన స్వగృహం సమతా నగర్‌లో ఉందని తెలియడంతో సభ్యులు ఆమె నివాసానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నట్లుగా సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించలేదు.

దరఖాస్తులు, సంతకాలు చూసాకే రుణ మంజూరు

యూనియన్ బ్యాంక్ మేనేజర్ వై.నాగ రమేష్

తాము యానిమేటర్లు తీసుకువచ్చిన దరఖాస్తులు, సంతకాలు చూసాకే రుణాలు మంజూరు చేస్తాము. ఇందులో సిబ్బంది పొరపాటు పూర్తిగా ఉందని భావించడం లేదు. దీనిపై పూర్తి విచారణ జరపాల్సి ఉంది. ఇప్పటి వరకు సుమారు కోటి రూపాయలుపైబడి ఉండవచ్చని అంచనా. ఈ మొత్తం వ్యవహారంపై రీజియన్ స్థాయిలో ఇన్‌స్పెక్షన్ టీమ్‌కు స్వాధీనపరిచాము. త్వరలోనే చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం. తమ బ్యాంకు న్యాయవిభాగం ఇప్పటికే దీన్ని పరిశీలిస్తుంది. రికార్డు మొత్తం వారు స్వాధీనం చేసుకున్నారు. 40 గ్రూపులు పూర్తిగా నష్టపోలేదు, యానిమేటర్ సుధ నిర్వహించే 19 గ్రూపులు, హేమలత బాధ్యతలోని 13 గ్రూపులు నష్టపోయినట్టు ఇప్పటి వరకు అంచనాలు వేశాం.

కమ్ముకున్న పొగ మంచు



జాతీయ రహదారిపై కురుస్తున్న మంచు

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు కమ్ముకుంది. చలి తీవ్రత పెరగడంతో పాటు రోడ్లపై దృశ్యమానత తగ్గడంతో వాహనదారులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు పొగమంచు ప్రభావంతో మామిడి పూత మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చలి పంజాకు తోడు మంచు మేఘాలతో జనజీవనం మందగించింది. పొగమంచు కారణంగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, ఫాగ్ లైట్లు ఉపయోగించాలని అధికారులు సూచిస్తున్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు బ్రౌనింగ్ విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి - భీమవరం

కర్ణాటక రాష్ట్రం మంగళూరులో జరగనున్న 69వ జాతీయస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ నిర్మల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు నుంచి భీమవరం బ్రౌనింగ్ కళాశాల విద్యార్థినులు జి.లిఖిత(ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిహెచ్‌డబ్ల్యు), ఎన్.వర్షిత లక్ష్మీ భద్ర(ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిఇసి) రాణించి ప్రాతినిధ్యం వహిస్తున్నారని ప్రిన్సిపల్ కె.నవీన్ కుమార్ తెలిపారు. ఈనెల 24వ తేదీ నుండి 29వ తేదీ వరకు నెట్ బాల్ అండర్-19 జాతీయస్థాయి పోటీలు జరగనున్నాయి. ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు నుండి ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారని పిడి దావూద్ ఖాన్ తెలిపారు. చర్చ్ ఆఫ్ క్రైస్ట్ విద్యాసంస్థల ప్రెసిడెంట్ మేడిది జాన్సన్, సెక్రటరీ మేడిది ఎస్తేరు ప్రియాంక చేతుల మీదుగా జాతీయ స్థాయి క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అబ్రహం, ప్రిన్సిపల్ కె.నవీన్ కుమార్, ప్రేమ్ కుమార్, పిడి దావుద్ పాల్గొన్నారు.

కాలుష్యం నివారణకు మొక్కలు పెంచాలి

లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - గణపవరం

కాలుష్యం నివారణకు కాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచవలసిన అవసరం ఉందని గణపవరం లయన్స్ క్లబ్ చైర్మన్ రాచూరి నాగరాజు, కోశాధికారి కెవిఎస్.మూర్తి అన్నారు. లయన్స్ క్లబ్ కారకాల వేటులు పుట్టినరోజు సందర్భంగా బుధవారం సరిపల్లి మండలపరిషత్ పాఠశాల ఆవరణలో కొబ్బరి, మామిడి మొక్కలు నాటారు. అనంతరం ఎస్‌ఇ కాలనీ వేలంపేటలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు భోజనం చేయటానికి ప్లేట్లు, పోషకాలు కలిగిన బిస్కట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, పాఠశాల హెచ్ఎం, లయన్ సభ్యులు మద్దాల వెంకటేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

విజేతల వివరాలు వెల్లడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలకు మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విజేతల వివరాలను ఎంఇఒ-1 యండమూరి లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. ఉపాధ్యాయ గైడ్ ఎస్‌ఎన్‌వేణిలో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలో పెట్టిన ఎగ్జిబిట్లలో వరుసగా సస్టైనబుల్ అగ్రికల్చర్(జెడ్‌పి హై స్కూల్, ఎస్‌ఇ పర్రు), ఆల్టర్నేటివ్ వేస్ట్ మేనేజ్మెంట్(ఎస్‌విజి జెడ్‌పి హైస్కూల్, మార్టేరు), గ్రీన్ ఎనర్జీ(జెడ్‌పి హై స్కూల్, ఆలమూరు), ఎమర్జింగ్ టెక్నాలజీస్(జెడ్‌పి హై స్కూల్, జుత్తిగ), రీ క్రియేషన్స్ మేథమెటిక్స్ మోడలింగ్(ఆర్‌ఎ జెడ్‌పి హై స్కూల్, పెనుమంట్ర) సాధించాయి. హెల్త్ అండ్ హైజీన్(ఎస్‌విజి జెడ్‌పి హై స్కూల్, మార్టేరు) వాటర్ కన్జర్వేషన్ అండ్ మేనేజ్మెంట్(జెడ్‌పి గర్ల్స్ హై స్కూల్, మార్టేరు) తొలి ఐదు స్థానాలు సాధించాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో మేథమెటిక్స్‌లో ఆత్రిగ జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని సాయినందిని పెద్దింటి, ఫిజిక్స్‌లో పొలమూరు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి వై.శివ శంకర్, ఉపాధ్యాయుల విభాగంలో మేథమెటిక్స్‌లో మార్టేరు బిడి జెడ్‌పి గర్ల్స్ హై స్కూల్ టీచర్ విపిడి.కామేశ్వర ఎంపికయ్యారని ఆయన యండమూరి తెలిపారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో ముగిసిన టెక్ క్యాంప్

భీమవరం టౌన్: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన మూడు రోజుల పాటు జరిగిన గూగుల్ ఎఐ ఎంఎల్ టెక్ క్యాంప్ బుధవారం సాయంత్రం ముగిసింది. ఏఐ స్కిల్స్, గూగుల్ డెవలపర్స్ సహకారంతో నిర్వహించిన ఈ క్యాంపునకు రిసోర్స్ పర్సన్‌గా ప్రముఖ సాఫ్ట్‌వేర్ నిపుణులు అజిత్ వర్మ వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ పి.రవి కిరణ్ వర్మ మాట్లాడుతూ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రస్తుతం ఇంటర్నెట్ ఏఐ నుంచి క్వాంటం టెక్నాలజీస్ వరకు డెవలప్ అయిందన్నారు. భవిష్యత్తులో మరింత వేగంగా మారుతుందని, దీన్ని అధ్యయనం చేసేందుకు విద్యార్థులు సాంకేతిక వర్క్ షాప్‌ల ఎక్కువగా హాజరుకావాలని సూచించారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్స్‌గా ఎస్‌విఎస్ఎన్.లక్ష్మి సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఈ సందర్భంగా క్యాంపులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు ప్రత్యేక సర్టిఫికెట్లు అందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

నరసాపురం: లిఖితపూడి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లంకలపల్లి సాయిబాబు(26) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. నరసాపురం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరై తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో ఒక్కసారిగా కుప్పకూలారు. స్థానికులు ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విధి నిర్వహణలో చురుగ్గా ఉండే సాయిబాబు అకాల మరణంతో తోటి సిబ్బంది, ఉపాధి కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు.

రామరాజుకి అభినందన

కాళ్ల: టిడిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మంతెన రామరాజుని బుధవారం టిడిపి మండల నాయకులు పలువురు కలిసి అభినందనలు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి వెంకట రత్నప్రసాద్, ప్రధాన కార్యదర్శి మంతెన కోదండ రామరాజు, మంతెన పెదనరసింహరాజు, మంతెన చినసరసింహరాజు, మంతెన అంజనేయరాజు, కంతేటి శ్రీనివాసరావు, పలువురు టిడిపి నాయకులు మంతెన రామరాజుని కలిసి అభినందనలు తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడేపల్లిగూడెం: ప్రజల మనిషి, సేవాతత్పరులు ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పార్టీలకతీతంగా చేస్తున్న సేవలు నియోజకవర్గ ప్రజల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ పేర్కొన్నారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం సిఎం సహాయ నిధిని యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ చేతుల మీదుగా సుమారు రూ.13 లక్షల 23 చెక్కులు మండల అధ్యక్షుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, పెంటపాడు మండల జనసేన అధ్యక్షులు పుల్ల బాబి, చాపల రమేష్, వాడపల్లి సుబ్బారావు, కిలపర్తి వెంకట్రావు, పాలూరి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నరసాపురం: నరసాపురం బస్టాండ్‌లో ఎపిఎస్ఆర్‌టిసి ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రేమ, శాంతి, ఐక్యతతో సమాజం ముందుకు సాగాలని సందేశం ఇచ్చారు. క్రిస్మస్ పండుగ మానవ విలువలను, పరస్పర సోదరభావాన్ని పెంపొందించే పండుగ అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయసారథి, ఘనంగా నిర్వహించిన ఎపిఎస్ఆర్‌టిసి అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

23న క్రిస్మస్ వేడుకలు : టిడిపి

భీమవరం టౌన్: కూటమి ప్రభుత్వం ఎస్సీలకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ అన్నారు. భీమవరం టిడిపి కార్యాలయంలో టిడిపి ఇన్‌ఛార్జ్ తోట సీతారామలక్ష్మి ఆదేశాల మేరకు బుధవారం ఎస్సీ సెల్ పట్టణ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ 6 హామీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. ఈనెల 23వ తేదీన భీమవరం టిడిపి కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఎస్సీ సెల్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు ఎద్దు ఏసుపాదం, యాళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీల సంక్షేమంతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మీసాల రామకృష్ణ, జనపర్తి కృష్ణప్రసాద్, నేలపాటి రవికిరణ్, బాతు నరేష్, యాళ్ల సురేష్, యాళ్ల దాను, సారెల్ల ఏసు, గంటా మాధుర్య, లింగాల శ్రీరామ్, మూలపర్తి మోహన్, చెరుకు తిరుపతిరావు, పేదారి గణేష్, గంధం రాఘ, ఎమ్‌డీ అలీషా భాషా పాల్గొన్నారు.

ఆలయ ప్రాంతం పరిశీలన

నరసాపురం: సీతారాంపురం సౌత్ పరిధిలోని రాజులపాలెం ఏరియాలోని అమ్మవారి ఆలయం ప్రాంతాన్ని ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి డాక్టర్ శ్రీ.శ్రీదేవి బుధవారం సాయంత్రం పరిశీలించారు. అమ్మవారి ఆలయ అంశంపై న్యాయ స్థానం పరిధిలో ఉన్నందున స్థానికుల ఈ విషయంలో ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా సంయమనంతో వ్యవహరించాలని హితవు పలికారు. అనంతరం స్థానికులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అయితం సత్యనారాయణ, నరసాపురం పట్టణ సిఐ బి.యాదగిరి, మొగల్తూరు ఎస్ఐ వాసు, వీఆర్‌ఒ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

పలువురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పాములపర్రు గ్రామంలోని పేకాట స్థావరంపై ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.7,500 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మండలంలోని కలిగొట్ల గ్రామంలో పేకాట స్థావరంపై ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా తన సిబ్బందితో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,700 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పాందువ్వ గ్రామంలోని కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.7,700, ఒక కోడిపుంజును, ఒక కత్తిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డిఎస్.నకారా చిరస్మరణీయులు

పలుచోట్ల పెన్షనర్ల దినోత్సవం



భీమవరంలో పెన్షనర్లను సన్మానిస్తున్న నేతలు



తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భీమవరం యూనిట్ ఆధ్వర్యాన స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో 15 మంది సూపర్ సీనియర్ పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించారు. యూనిట్ అధ్యక్షులు ఎన్ఎస్ఎస్.పాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డిటిఒ మొహమ్మద్ మజ్హర్ బేగ్ మాట్లాడుతూ డిఎస్.నకారా పోరాట ఫలితంగా పెన్షనర్స్ ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. పెన్షనర్స్ ఏ సమస్య వచ్చినా తన దగ్గరకు స్వయంగా రావచ్చునని, వెంటనే సమస్యను సానుకూలంగా పరిష్కరిస్తానన్నారు. ఎస్‌టిఒ రవివర్మ, జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఎన్.రాజు, యూనిట్ కార్యదర్శి సీతారామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కరరావు, కార్యదర్శులు సత్యనారాయణ, ముత్యాలరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పెన్షనర్స్ హక్కుల పోరాట యోధుడు డిఎస్.నకారా చిరస్మరణీయుడని ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయ ఆవరణలో పెన్షనర్స్ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు బి.హరికుమార్ అధ్యక్షతన పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంపరాల నారాయణమూర్తి మాట్లాడుతూ పెన్షన్ అనేది యజమాని ఇష్టాలతో ఇచ్చే ధనము కాదని అది పెన్షనర్లకు స్థిరమైన హక్కు అన్నారు. ముందుగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ట్రెజరీ అధికారి దత్తతేశ్వరరావు, తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంపిడిఒ చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, సెక్రటరీ మూర్తి, కోశాధికారి ముస్తాఫ్ కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం 19 మంది సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు సంఘం ఆధ్వర్యాన సన్మానించి సత్కరించారు. భీమవరపు మహాలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులందరికీ విందు ఏర్పాటు చేశారు.

ఉండి: ప్రతీ పెన్షనర్ ప్రశాంతమైన జీవనం గడపాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉండి సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. బుధవారం జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా ఉండిలో జరిగిన కార్యక్రమంలో ఫాదర్ ఆఫ్ నేషన్ డిఎస్ నకారా, చంద్రచూడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడారు. అనంతరం కూనపరాజు రామరాజు, రామూర్తి రాజు, సిహెచ్.సత్యనారాయణ, ఎం.కృష్ణవేణి, జి. మహంకాళిలను సత్కరించారు. మండల శాఖ కార్యదర్శి గాంధీబాబు రాజు, ముదునూరి గోపాలరాజు, పిల్లలమర్రి శ్యామలరావు పాల్గొన్నారు.

నరసాపురం : జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నరసాపురం యూనిట్ ఆధ్వర్యాన స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రం మినీహాల్‌లో పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ ట్రెజరీ పి.లలితకుమారి విచ్చేసి డిఎస్.నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎం.మార్కండేయులు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా సీనియర్ పెన్షనర్స్ మంగిన సూర్యచంద్రరావు, తాటిపర్తి జార్జ్, తాడిమేటి కృష్ణవేణి, యార్లగడ్డ వసుంధరాదేవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎ.హరినాథ్ కృష్ణ, ఆర్.రామకృష్ణరాజు, బి.ఆనందరాజు, వై.స్వామినాయుడు, పి.బాబుశ్రీ, షేక్ సిలార్, ఎన్‌బివి.జాకబ్, సిహెచ్‌విఆర్‌కె.సాగర్, కెవికె.సుబ్రహ్మణ్యం, కెఎస్‌వి.ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

పెనుమంట్ర : పెన్షనర్స్ పాలిట దైవంలా కీర్తిశేషులు డిఎస్.నకారా కలకాలం నిలిచి ఉంటారని గవర్నమెంట్ పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి, జిల్లా ఎపిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు పాలా ప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని మార్టేరు రోటరీ క్లబ్ భవనం లో జరిగిన జాతీయ పెన్షనర్స్ దినోత్సవం కార్యక్రమంలో తొలుత నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రిటైర్డ్ తహశీల్దార్ చిర్ల సూర్యనారాయణ రెడ్డిని సభ్యులు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తామాడ సత్యనారాయణ, పడాల జగన్నాధ రెడ్డి, సబ్బితి నందన్ కుమార్, బోళ్ల సత్యనారాయణ చౌదరి, నమ్మి కనక నాగేశ్వరరావు, జెస్సికుమారి పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో పలువురికి సత్కారాలు జరిగాయి. పలువురు విశ్రాంత ఉద్యోగులకు, సమాజ సేవకులకు స్థానిక పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యాన ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు వంగా నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథి, సబ్ ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ముందుగా సమాజానికి విశిష్ట సేవలు అందించిన విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి కేశిరాజు నరసింహారావును వారి నివాసం వద్ద సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను, ఫలాలను అందజేశారు. అదేవిధంగా విశ్రాంత ఉపాధ్యాయులు కంభంపాటి కామేశ్వరరావు, కొట్టి భాస్కరరావు, నందుల రమణి, మండెల శ్రీరామమూర్తి, గుణ్ణం వీరాస్వామి, ఇళ్ల విష్ణుమూర్తి, ఎస్‌వి పాదేశ్వరి తదితరులతో పాటు ముఖ్య అతిథులుగా హాజరైన కమిషనర్ విజయసారథి, ఎస్‌టిఒ శ్రీనివాసరావులను సంఘ అధ్యక్ష కార్యదర్శులు వంగా నరసింహారావు, ప్రతాపరాజు ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. సంఘ ప్రతినిధులు నందుల సీతారామారావు, కలిదిండి వెంకటపతి వర్మ, దాట్ల రామకృష్ణంరాజు, రామరాజు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పాలకొల్లు శాఖ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం పాలకొల్లు జనరల్ ఆసుపత్రిలో రోగులకు, బాలింతలకు ఆపిల్ పండ్లు పంపిణీ చేశారు. సాయంత్రం స్థానిక లయన్స్ నగర్‌లో రామాంజుల రేచల్ శాస్త్రి చిల్డ్రన్ హోంలో సుమారుగా 50 మంది చిన్నారులకు పండ్లు, బిస్కట్లు, బాల్ పెన్నులు వితరణ చేసారు. ఈ సేవా కార్యక్రమాల్లో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఐ.వెంకటేశ్వర రావు, కార్యదర్శి కెవిఎస్ఎన్.మూర్తి, సహాయ కార్యదర్శి ఐవి.రావ్, కోశాధికారి నాగలింగేశ్వర రావు ఉన్నారు.

తణుకు : జనరల్ ఇన్సూరెన్సు ఉద్యోగులకు యూనివర్సల్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని ఎపి జనరల్ ఇన్సూరెన్సు పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎఎస్‌వి.శేషుబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం ప్రాంతాల్లో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు, ఓరియంటల్, నేషనల్, న్యూ ఇండియా, యునైటెడ్ ఇండియా కార్యాలయాల్లో పనిచేసే రిటైర్డ్ ఉద్యోగులు స్థానిక ఓరియంటల్ ఇన్సూరెన్స్ కార్యాలయం వద్ద పెన్షనర్స్ జాతీయ దినోత్సవం సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుబాబు మాట్లాడుతూ.. ఫ్యామిలీ పెన్షన్ 15 శాతం నుండి 30 శాతానికి పెంచాలని, ఉద్యోగులకు వేతన సవరణలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కెవిఎస్ఎన్.రాజు, కె.కనకరాజు, రాఘవేంద్రరావు, కందుల వెంకటేశ్వర్లు, బాపిరెడ్డి, రాజేంద్రప్రసాద్, పి.సత్యవతి, కె.స్వరూపరాణి, ఆర్.సత్యవతి, కఠారి కాశీవిశ్వనాధరాజు పాల్గొన్నారు.



పెనుమంట్రలో రిటైర్డ్ తహశీల్దార్‌ను సన్మానిస్తున్న సభ్యులు



ఉండిలో..

పార్టీషన్ దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం, నరశింగపాలెం గ్రామ వాస్తవ్యులు చింతగుంట ఇస్మాయేలు గారి కుమారుడు చింతగుంట ప్రకాశరావు పేరున గన్నవరం మండలం, మెట్లపల్లి రెవిన్యూ గ్రామంలోని ఆర్.యస్.నెం. 91/3రు దాఖలా య.0.6050 సెంట్లు వ్యవసాయ భూమికి సంబంధించిన ఒరిజనల్ పార్టీషన్ దస్తావేజు (నెం.7252/2016)ను జిరాక్స్ తీయించుకొని వెళ్లే క్రమంలో ది.15.12.2025వ తేదీన పోయినవి. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

చింతగుంట ప్రకాశరావు, (తండ్రి) ఇస్మాయేలు, నరశింగపాలెం గ్రామం, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా. సెల్: 77807 39954.

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా కోర్టు : పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు

ఎ.ఎస్.నెం.147/2023

శ్రీ కేసరపల్లి సుబ్బారావు ...అప్పిలెంటు


మరియు

1. శ్రీమతి పిప్పర వరలక్ష్మి
2. శ్రీమతి కిష్టారపు నాగమణి
3. శ్రీమతి తూతికుంట శారద
4. శ్రీమతి పెద్దాడ అనూరాధ
5. శ్రీమతి శృంగవృక్షం సత్యవతి
6. శ్రీ శృంగవృక్షం రవికుమార్ (డైడ్)
7. శ్రీ శృంగవృక్షం కిషోర్ కుమార్
8. శ్రీమతి శృంగవృక్షం విజయలక్ష్మి
9. కుమారి శృంగవృక్షం సునీత శ్రావణి
10. శ్రీ శృంగవృక్షం మోహన్ శ్రీరాం

...రెస్పాండెంట్లు

పై నంబరు అప్పీలు గ్రంథమును అప్పిలెంటు ఓ.ఎస్.నెం.471/2016 అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఏలూరు వారి ది.23.08.2023వ తేదీ తీర్పు రద్దు కొరకు దాఖలు చేయగా, పైన పేర్కొన్న రెస్పాండెంట్లు 2 నుండి 7 వారలకు నోటీసు నిమిత్తము ది.28.01.2026వ తేదీకి వాయిదా అయివున్నది. కాబట్టి పై వారలు, సదరు తేదీ ఉదయం గం.10.30 ని.లకు పైకోర్టు వారి ఎదుట హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమున అప్పీలు తీర్మానించబడును.

ఎస్.వి.ఆర్.గాంధీ
ఏలూరు అప్పిలెంట్ తరపున అడ్వకేట్
తేది.15.12.2025 ఆర్.ఆర్.పేట, ఏలూరు-2.




ఎంఎల్ఏతో మాట్లాడుతున్న మోగ్లీ చిత్ర తారలు

యువతకు నచ్చే చిత్రం మోగ్లీ : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితురాలు యాంకర్ సుమ అని, ఆమె అంటే అందరికీ ఎంతో అభిమానమని, ఆమె కుమారుడు రోహన్ కనకాల అంటే కూడా అంతే అభిమానం చూపిస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని ఎంఎల్ఎ నివాసంలో బుధవారం మోగ్లి చిత్ర హీరో రోషన్ కనకాల, హీరోయిన్ సాక్షి మదోల్కర్‌లు ఎంఎల్ఎ అంజిబాబును కలిశారు. వారికి స్వాగతం పలికి శాలువ కప్పి ఎంఎల్ఎ అంజిబాబు సత్కరించారు. మోగ్లీ చిత్రం ఎంతో బాగుందని, ప్రేమలోని నూతన కోణాన్ని ఈ చిత్రంలో చూపించారని, కథ చాలా డిఫరెంట్‌గా ఉందన్నారు. మోగ్లీ అనేది కేవలం సినిమా కాదని, యువత ఫీల్ అయ్యే కథ అని, ఇదొక ప్రేమ యుద్ధమని చిత్ర యూనిట్ సభ్యులను అభినందించారు.



కొబ్బరి చెట్ల వేలంపాట నిర్వహిస్తున్న గ్రామాధికారులు

వేంపాడులో కొబ్బరి చెట్ల వేలం

రికార్డు స్థాయిలో ఆదాయం

ప్రజాశక్తి - కాళ్ల

వేంపాడు గ్రామ పంచాయతీలో కొబ్బరి చెట్ల వేలం పాటల్లో రికార్డు స్థాయిలో పంచాయతీకి ఆదాయం వచ్చిందని గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి సుంకర వెంకటేష్ అన్నారు. బుధవారం వేంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో 100 కొబ్బరి చెట్లకి 3 సంవత్సరాల వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వ కనీస ధర రూ.60,500గా నిర్ణయించారు. కొబ్బరి చెట్లకి పోటీ వాతావరణంలో 100 చెట్లకు రూ.4 లక్షల 85 వేలు పాడుకున్నారు. కనీస ధరకు 8 రెట్లు అధికంగా పాట వెళ్లింది. ఈ పాటలో కామన రవి రూ.4 లక్షల 27 వేలు, వీరుమల్లు అంజి రూ.58 వేలతో పాట హక్కులు పొందారు. ఈ వేలం పాటలో గ్రామ సర్పంచి యిర్రింకి పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన గణిత శాస్త్ర విభాగం వారు మ్యాథమెటికల్ సుడోకు, మ్యాజిక్ స్క్వేర్స్ అనే అంశం మీద పజిల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఈ పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల జ్ఞానం, క్రియేటివిటీ, జీవితంలో ఎదురయ్యే సమస్యలను సునాయాసంగా పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగం అధ్యాపకులు కె.శివకృష్ణ, బికెవి.రామలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తి సంరక్షణపై అవగాహన

గణపవరం: గణపవరం డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు శక్తి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ పి .నిర్మలాకుమారి మాట్లాడుతూ శక్తి సంరక్షణ అనేది కేవలం అవసరమే కాకుండా సామాజిక బాధ్యతగా మారాలన్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లెక్చరర్లు, సిబ్బంది ఉన్నారు.


దుప్పట్లు పంపిణీ

పాలకొల్లు : పాలకొల్లుకు చెందిన అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన దాతల సహకారంతో పాలకొల్లు, వీరవాసరం, శృంగవృక్షం, భీమవరం, నరసాపురం, చించినాడ పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కల నివసించే అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఆయా ప్రాంతాల్లో పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు అంబటి సాయితేజ, గోడి హరికృష్ణ ఉన్నారు.

ట్రాక్టర్ బహూకరణ

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లు గ్రామానికి దాతలు పంచాయతీ సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాస్, పెనుమత్స సుబ్బరాజు ఆర్థిక సహకారంతో రూ.2 లక్షల 50 వేలు విలువ చేసే ట్రాక్టర్ బహూకరించారు. పంచాయతీ అవసరాల నిమిత్తం ట్రాక్టర్‌ను సొంత నిధులు వెచ్చించి కొనుగోలు చేసి అందజేశారు. సర్పంచి కృష్ణకుమారి శ్రీనివాస్ రూ.లక్ష 50 వేల విలువచేసే ట్రాక్టర్, సుబ్బరాజు రూ.లక్ష విలువచేసే ట్రక్కును అందించడం జరిగింది. ఈ ట్రాక్టర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరికీ ఉపయోగపడాలనే ముఖ్య ఉద్దేశంతో ట్రాక్టర్‌ను సొంత నిధులతో కొనుగోలు చేసి ఉచితంగా పంచాయతీకి అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా దాతలు సర్పంచి కృష్ణకుమారి శ్రీనివాస్, సుబ్బరాజును గ్రామస్తులు అభినందించారు.




ట్రాక్టర్‌తో దాతలు సర్పంచి కృష్ణకుమారి శ్రీనివాస్, సుబ్బరాజు

పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

ఇన్‌ఛార్జి ఎడిఎ డాక్టర్ ఇంజేటి సురేంద్ర కుమార్

ప్రజాశక్తి - నరసాపురం



ఈనెల 19వ తేదీ శుక్రవారం యర్రంశెట్టివారి పాలెం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించనున్న పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి ఎడిఎ డాక్టర్ ఇంజేటి సురేంద్ర కుమార్ పాడి రైతులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యాన ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. పశుసంపదను వృద్ధి చేసుకునేందుకు, పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఉచితంగా గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా నిర్వహించే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పశుఆరోగ్య శిబిరాల ద్వారా పశువిద్య చికిత్సలు, నట్టల నివారణా మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన వంటి సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా లేగ దూడల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థికి గోల్డ్ మెడల్

భీమవరం టౌన్: ఈనెల 12, 13వ తేదీల్లో తణుకులో జరిగిన అండర్-19 ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థి జి.అనిల్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి అనిల్ కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు తమ దేహదారుడ్యాన్ని కూడా పెంపొందించుకునేందుకు, ఆత్మస్థైర్యాన్ని మానసిక ఆరోగ్యాన్ని ధృడపరుచుకోవటానికి కరాటే లాంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.హరిమోహన్ అనిల్ కుమార్‌ను అభినందించారు.

హైస్కూల్‌లో పుస్తకావిష్కరణ

ఉండి: విశ్రాంత ఉపాధ్యాయులు చిలుకూరు వెంకటేశ్వర్లు ఆంగ్ల మాధ్యమంలో రచించిన స్టెప్ టువార్డ్స్ స్పిరిట్ ఆఫ్ గోల్ అనే పుస్తకాన్ని ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించడం తమకు గర్వకారణమని ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. బుధవారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ తమ గురువు చిలుకూరి వెంకటేశ్వర్లు సుమారు 21 సంవత్సరాల పాటు గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని, అటువంటి ఉపాధ్యాయులు రచించిన స్టెప్ టువార్డ్స్ స్పిరిట్ ఆఫ్ గోల్ అనే పుస్తకాన్ని ఆయన వద్ద చదువుకున్న పూర్వపు విద్యార్థులు అందరం కలిసి ఆవిష్కరించడం జీవితంలో మర్చిపోలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు భూపతిరాజు హరనాథరాజు, గజపతిరాజు తదితరులు పాల్గొని చిలుకూరి వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం నిర్వహించారు.

మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ,కాకినాడ

E.P.No.153/2025 in O.S.No. 863/2024

Between:
దిండి వరలక్ష్మి ...DHR
మరియు
గుడిపూడి రమేష్ బాబు@ రమేష్ ...JDR
To
JDR: గుడిపూడి రమేష్ బాబు, @ రమేష్, తండ్రి వెంకటరత్నం, వయస్సు 40సంగలు. పోలీస్ కానిస్టేబుల్, పి.సి.నెం.3428, మందపల్లి గ్రామం, జాలిపూడి పోస్ట్, ఏలూరు రూరల్ మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు అమలు గ్రంథములో JDR అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీహజరు నిమిత్తం **ది.19-12-2025వ** తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **గంగ10.30నిగలకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వింజమూరి వెంకటరావు
అడ్వకేటు,కాకినాడ
సెల్:9866550610

మహారాజశ్రీ 3వ అదనపు (మొబైల్) జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఏలూరు

ఓ.యస్.నెం.360/2025

బిట్వీన్:-
శ్రీమతి. మానేపల్లి మమతా విశాలాక్షి ...పిటీషనర్/వాది
మరియు
శ్రీ కె.హెచ్.యల్.యస్.యస్.వి. మురళీ నాగరాజు యలియాస్ మురళీ రాజ్ ...రెస్పాండెంట్

పిటీషనరు/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో రెస్పాండెంటు అయిన శ్రీ. కె.హెచ్.యల్.యస్.యస్.వి. మురళీ రాజ్, తండ్రి: రామచంద్రరావు, డోర్.నెం. 4-20-30, అగ్రహారం, ఏలూరు-1, ఏలూరు జిల్లా అను వారికి **ది. 02-01-2026వ తేది ఉదయం గం. 10-30 నిగలకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావాను తమ పరోక్షమందు విచారించి తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

గెల్ల శ్రీనివాసరావు
గెల్ల సాయి అనూష
ఏలూరు అడ్వకేట్స్, ఉప్పు వారి వీధి,
ది.17-12-2025 ఎన్.ఆర్.పేట్, ఏలూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
దేవదాయ ధర్మదాయ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంటు నోటీసు

ఏలూరు జిల్లా & మండలం, ఏలూరు నగరం, కొత్తరోడ్డులో వేంచేసియున్న శ్రీ ఆదర్శ ఆంజనేయస్వామి వారి దేవస్థానమును పునఃనిర్మించుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రూ.40.00 లక్షలకు టెండర్ పిలుచుట జరుతున్నది. కావున ఆసక్తిగలవారు మరిన్ని వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైట్ చూడగలరు.

ఏలూరు, తేది.17.12.2025 సం/- కార్యనిర్వహణాధికారి

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.12/2025 in O.S.No.9/2024

Between:
D.H.R : Sala Jaya Sankar
And
J.D.R : Battu Indu
To.
Battu Indu, D/o.William Cary Babu, R/o.D.No.3-38/2, 1st Floor, Yalla Vani Garuvu Panchayat, Gaggiparru Road, Palakol Rural, W.G.Dt.

పై నంబరు E.P అమలు గ్రంథములో మీకు ఎన్నిసార్లు నోటీసులు కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున DHR పేపర్ ప్రకటన ద్వారా నోటీసు అమలు జరిపించమని కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా శ్రీకోర్ట్ వారు పేపర్ ప్రకటన ద్వారా నోటీసు మీకు పంపమని ఉత్తర్వులు జారి చేసినందున పై నంబరు వారంటు అమలు గ్రంథములో మీ హాజరు నిమిత్తం ది.23-12-2025 సం.తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 నిగలకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు వారంటు అమలు గ్రంథము జరుపబడును.

జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, కోట చంటియ్య
పాలకొల్లు DHR తరపు న్యాయవాదులు,
తేది.13-12-2025 పాలకొల్లు, ప.గో.జిల్లా.

IN THE COURT OF THE CHAIRMAN MOTOR ACCIDENTS CLAIMS TRIBUANL IST ADDL. DISTRICT JUDGE AT: NALGONDA.
M.V. O.P.NO. 117 OF 2020.

Between:
Bandaru Yadagiri @ Yadaiah. **...Petitioner.**
AND
Madhura Vinesh Babu and others. **...Respondents.**
To
R2
Balaji Projects, D.No. 3-2-20/1, Vidyanagar, Tirupathi, West Godawari District, Pin: 534 134, Andhra Pradesh, Represented by its Authroied signatory (Owner of the Maruthi Swift Dzire Car bearing No. KA-41-M-8706)

Take notice that the petitioner had filed the above O.P. for grant of compensation on compensation on account of injuries sustained by him in a motor vehicle accident against you and others. The said case is posted to **19-01-2026** for your appearance.

Hence, you are hereby directed to appear in person or through Advocate before the court on **19-01-2026 at 10-30 A.M.,** without fail, failing which the matter will be decided against you as per law.

//BY ORDER OF THE COURT//
REGATTE BHUPAL REDDY
PADAM SEENAIAH
Advocates,
Off: 6-3-488, Shivaji Nagar, Nalgonda, TS.
Cell: 9848390576, 9410147182